క్లుప్తంగా

కరాటే టోర్నమెంట్



పోటీపడుతున్న చిన్నారులు

కొందుర్గు: కొందుర్గు మండల కేంద్రంలోని జీఎం పటేల్ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం జిల్లా స్థాయి కుంగ్‌ఫూ కరాటే టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీల్లో షాద్‌నగర్, షాబాద్, నాగర్‌కర్నూల్, కొల్లూర్ తదితర ప్రాంతాలకు చెందిన 300 మంది బాలబాలికలు పాల్గొని తమ ప్రదర్శనలతో పలువురిని ఆకట్టుకున్నారు. బాలికల విభాగంలో కొందుర్గుకు చెందిన నహీద్, బాలుర విభాగంలో యశ్వంత్ ప్రతిభ చూపి చాంపియన్‌షిప్ సాధించినట్లు మాస్టర్ రమేశ్ తెలిపారు. విజేతలకు నిర్వాహకులు మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో న్యూమాంక్స్ కుంగ్‌ఫూ అధ్యక్షుడు రాజేష్‌పటేల్, ఉపాధ్యక్షుడు బాల్‌రాజ్, నాగర్‌కర్నూల్ కేజీబీవీ ప్రత్యేకాధికారి లత పాల్గొన్నారు.

నేటి నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



ముస్తాబైన దవళగిరి వేంకటేశ్వర స్వామి దేవాలయం

కేశంపేట: మండల కేంద్రంలోని దవళగిరి శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం అవుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మొదటిరోజు పంచామృతాభిషేకం, మంగళవారం ధ్వజారోహణము, బుధవారం శ్రీవేంకటేశ్వరస్వామి అలంకరణ, గురువారం శ్రీవేంటకేశ్వరస్వామి కల్యాణం, అనంతరం మాజీ సర్పంచ్ తలసాని వెంకట్‌రెడ్డి అన్నదానం నిర్వహించనున్నారు. సాయంత్రం ప్రభల ఊరేగింపు, శుక్రవారం రథోత్సవం, శనివారం స్వామి వారి ఊరేగింపు, పట్టాభిషేకం, ఆదివారం అంతర్‌రాష్ట్ర బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాలకు మండల ప్రజలతో పాటు సమీప గ్రామల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

శ్రీనివాస్‌రెడ్డి నియామకంపై హర్షం

షాద్‌నగర్ రూరల్: రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్‌గా టీయూడబ్ల్యూజె (ఐజేయూ) జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం హర్షణీయమని రాష్ట్ర కార్యదర్శి గుడుపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జర్నలిస్టుల సమస్యలు తెలిసిన నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి అని అన్నారు. ఆయన నియామకంపై సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. సమర్థవంతమైన నేతను చైర్మన్‌గా ఎన్నుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు.

గిరిజనుల అభివృద్ధికి కృషి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నిర్వాహకులు

బడంగ్‌పేట్: గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తామని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. ఆదివారం గుర్రంగూడలో సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె సేవాలాల్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం సబితారెడ్డిని ఉత్సవ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మేయర్ పారిజాత, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ పాల్గొన్నారు.

చెక్కుచెదరని చరిత్రకు చిరునామా కాంగ్రెస్

మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్

కందుకూరు: చెక్కుచెదరని చరిత్రకు చిరునామా కాంగ్రెస్ అని మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్ అన్నారు. మండల మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాణాప్రతాప్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ఎండీ అఖిల్, ఎండీ రహీమ్ ఆధ్వర్యంలో లేమూరుకు చెందిన ఎం.రియాన్, ఎండీ జహంగీర్, ఎండీ మోబిన్, ఫయాజ్, అశ్వక్, ఇలియాస్, ఖాదర్, మోసిన్, అబుజర్, రజీయొద్దీన్, మతిన్, అక్బర్, ఆలీ, తబ్రేజ్, అంజద్, చోటఫయాజ్, ఖలీల్, నిజాం, జావీద్, నజీమ్, బషీర్‌లు పార్టీలో చేరారు. వారికి కేఎల్‌ఆర్ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్య సముపార్జన నుంచి నేటి వరకు దేశాభివృద్ధిలో కీలకభూమిక ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిందన్నారు.

సమస్యల పరిష్కారానికి ఉప సంఘం

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- అనాలోచితంగా తీసుకొచ్చిన జీఓతో ఇబ్బందులు
- 317 తొలగింపునకు ఉన్నతాధికారులతో అభిప్రాయ సేకరణ



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఉద్యోగ సంఘం నాయకులు

షాద్‌నగర్: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఉప సంఘాన్ని ఏర్పాటు చేసిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనాలోచితంగా తీసుకొచ్చిన 317 జీఓతో ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. కుటుంబాలను విచ్ఛిన్నం చేయడంతో ఉద్యోగులు పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. పాలన పారదర్శకంగా సాగాలన్నా, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నా ఉపాధ్యాయులు స్థానికంగా ఉండాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 317జీవోలోని సమస్యలు పరిష్కారానికి మార్గాలను చూపించేందుకు మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసిందన్నారు. ఈ సబ్ కమిటీ వివిధ శాఖల ఉన్నతాధికారులతో అభిప్రాయాలను సేకరిస్తుందని అన్నారు. సబ్ కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోనుందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. ఆర్థిక వ్యవస్థ చిన్నా భిన్నం అయినా సంక్షేమానికి పెద్దపీట వేసిందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఈ నెల 27న చేవేళ్లలో మరో రెండు గ్యారంటీలు అమలు చేయనుందన్నారు. ఈ పథకాల అమలుతో సుమారు 70 శాతం పేదలకు లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ సమావేశంలో పురుషోత్తంరెడ్డి, జితేందర్‌రెడ్డి, అందెమోహన్, ముబారక్, రాయికల్ శ్రీను, గంగనమోని సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

ప్రభుత్వం కులగణన చేసేందుకు నిర్ణయం తీసుకోవడంతో బీసీ ఉద్యోగ సంఘం నాయకులు ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శాలువా కప్పి, పూలమాలలు వేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీజీ శ్రీనివాస్, నాగరాజు, శ్రీనివాసులు, వెంకట్, వెంకటేశ్వర్లు, ఉదయ్‌కుమార్, బాలస్వామి, సత్యం, రాజు, రాములు, సురేష్, క్యాసెట్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ సంఘం నేతలు..

ప్రభుత్వం 317 జీఓ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం సబ్ కమిటీని ఏర్పాటు చేయడంతో ఉద్యోగ సంఘం నాయకులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు మహేందర్‌రెడ్డి, అమరేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్, రాములు, దత్తాత్రేయ, శశిధర్, రమేశ్, ప్రకాశ్, నీరజ, శ్రావణి, సుకన్య, పద్మలత పాల్గొన్నారు.

గెలుపోటములు సహజం

ఎమ్మెల్యే కాలె యాదయ్య, జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, జెడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి

షాబాద్: క్రీడల్లో గెలుపోటములు సహజమని ఎమ్మెల్యే కాలె యాదయ్య, జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి పేర్కొన్నారు. దివంగత నేత పట్నం రాజేందర్‌రెడ్డి స్మారకార్థం క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నారు. ఆదివారం షాబాద్ మండల కేంద్రంలోని పీఆర్‌ఆర్ మినీ స్టేడియంలో కార్తీక్‌రెడ్డితో కలిసి వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ క్రీడకారుల్లో నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు ఉపయోగపడుతాయన్నారు. విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో రాణించాలన్నారు. అనంతరం జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ ఆటల్లో క్రీడా స్ఫూర్తి చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో కె. మహేశ్‌యాదవ్, రమేశ్‌యాదవ్, ధనుంజయ్, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నక్క శ్రీనివాస్‌గౌడ్, జంగయ్య, దర్శన్, రాంచంద్రారెడ్డి, పాండు, కృష్ణగౌడ్, పెంటయ్య, ముత్రం, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక

కందుకూరు: కాంగ్రెస్ పార్టీ గూడూరు గ్రామ శాఖ నూతన కమిటీని ఆదివారం ఏక గ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ పార్టీ మండల కోఆర్డినేటర్ ఎండీ అఫ్జల్ బేగ్ ప్రకటించారు. అధ్యక్షుడిగా ఐనవోలు శ్రీకాంత్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా గోల్కండ సాయిలు, జనరల్ సెక్రటరీగా నర్ల రాఘవేందర్, యూత్ అధ్యక్షుడిగా పోల్దాస్ అరవింద్, ఉపాధ్యక్షుడిగా చిలుకల శ్రీరాములు, యూత్ జనరల్ సెక్రటరీగా ఎస్.రాము, కమిటీ సభ్యులుగా నర్సింహ, కుమార్, సురేందర్, లింగయ్య, కిషన్, అజ్జు, దేవేందర్, శేఖర్, రాంబాబు, నర్సింహ, శ్రీకాంత్, బాలు యోహాను, శ్రీను, శ్రీశైలం, సుధాకర్, మహేందర్, ప్రవీణ్, శ్రీను, రఫిక్, విజయ్, బాలకృష్ణలను నియమించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బుక్క పాండురంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం

ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు



మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు

చేవెళ్ల: కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం జరుగుతుందని ఐటీ శాఖ మంత్రి డి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. చేవెళ్లలో పార్లమెంట్ స్థాయి ముఖ్య నాయకుల సమావేశానికి మంత్రి శ్రీధర్‌బాబు హాజరయ్యారు. చేవెళ్ల మండలంలోని ఊరేళ్ల గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కుంచం శివకుమార్‌గుప్తా తన అనుచరులతో కాంగ్రెస్‌లో చేరారు. ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి పామెన భీంభరత్, సత్యనారాయణరెడ్డి, శైలజ, సమత, ఆగిరెడ్డి తదితరుల ఆధ్వర్యంలో ఆయన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా శివకుమార్‌గుప్తా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలను చూసి పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. కాంగ్రెస్‌లో ఉంటూ పేదలకు ప్రభుత్వం అందజేయనున్న సంక్షేమపథకాలు చేరేవిధంగా తన వంతు కృషి చేస్తానని చెప్పారు. ఆయన వెంట మంగళి శ్రీనివాస్, ఊరేళ్ల గ్రామానికి చెందిన యువకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి పనితీరు అస్తవ్యస్తం

- అందుబాటులో ఉండని వైద్య సిబ్బంది
- ఖాళీ కుర్చీలే దర్శనం
- పట్టించుకోని ఉన్నతాధికారులు



కొందుర్గు పీహెచ్‌సీ

కొందుర్గు: అత్యవసరంతో పాటు సరైన వైద్యసేవలు అందించాల్సిన ఆసుపత్రిలో సిబ్బంది కొరత, ఉంది. దీంతో ఇక్కడి ఉద్యోగులు సరిగ్గా విధులు నిర్వహించకపోవడం వల్ల రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ రెండు మండలాలకు సంబంధించి 46 గ్రామ పంచాయతీల్లో దాదాపు 70 గ్రామాలు 80వేల మంది జనాభా ఉన్నప్పటికీ కొందుర్గులో ఒకే ఒకటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉంది. ఈ పీహెచ్‌సీలో ఇద్దరు డాక్టర్లు ఉన్నప్పటికీ సాయంత్రం నాలుగు దాటితే ఏ ఒక్కరూ అందుబాటులో ఉండకపోవడం బాధాకరం. ఇక్కడ విధుల్లో నలుగురు స్టాఫ్ నర్సులు ఉండాల్సి ఉండగా ఒకరు కూడా డ్యూటీలో కనిపించరు. దీంతో ఇక్కడ ఖాళీ కుర్చీలే దర్శనమిస్తున్నాయి. గ్రామాల్లో విధులు నిర్వహించే కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలు స్టాఫ్‌నర్సులుగా విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ సూపర్‌వైజర్లు సహితం సరిగ్గా విధులకు హాజరుకాకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లోని ఆరోగ్య ఉపకేంద్రాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారుతోంది. గతంలో కొందుర్గు పీహెచ్‌సీలో నెలకు 30నుంచి 50 వరకు ప్రసవాలు జరిగేవి. ప్రస్తుతం 10 కూడా జరగడం లేదని పలువురు చెబుతున్నారు. అత్యవసర సమయంలో రోగులు షాద్‌నగర్, పరిగి, మహబూబ్‌నగర్ వెళ్లాల్సివస్తుందని వాపోతున్నారు. ఆసుపత్రిలో సిబ్బంది కొరత తీర్చడంతోపాటు, జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో నూతన పీహెచ్‌సీ ఏర్పాటుచేయాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కొందుర్గు పీహెచ్‌సీ పనితీరు మారేలా చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు.

మానవాళికి సేవ చేయడమే లక్ష్యం



పుష్కరిణి వద్ద సేవాకార్యక్రమంలో సంత్‌నిరంకారి సభ్యులు

చేవెళ్ల: మానవాళికి నిస్వార్థంగా సేవ చేయడమే లక్ష్యమని సంత్‌నిరంకారి చేవెళ్ల బ్రాంచ్ ముఖి సంయోజక్ మాణిక్య ప్రభు పేర్కొన్నారు. ఆదివారం బాబా హరదేవ్ సింగ్‌జీ మహారాజ్ జన్మదినం సందర్భంగా చేవెళ్ల సంత్ నిరంకారి బ్రాంచ్ ఆధ్వర్యంలో ప్రాజెక్ట్ అమృత్, స్వచ్ఛ నీరు, స్వచ్ఛ మనస్సు అనే సేవ కార్యక్రమంలోభాగంగా చేవెళ్ల శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి పుష్కరిణి ఆవరణలో చెత్త చెదారాన్ని శుభ్రంచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మనిషి సాటి మనిషికి తోచిన విధంగా సహాయ సహకారం అందించాలన్నారు. నిస్వార్థంగా ప్రతిఒక్కరూ సేవ చేసే గుణం అలవర్చుకోవాలన్నారు. బాబా హరదేవ్ సింగ్ జీ మహారాజ్ చూపిన మార్గంలో నడువాలని కోరారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల బ్రాంచ్ సంత్‌నిరంకారి సభ్యులు పాల్గొన్నారు.

ఫార్మాసిటీపై స్పష్టమైన ప్రకటన చేయాలి

యాచారం: ఫార్మాసిటీపై సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టమైన ప్రకటన చేయాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సేకరించిన భూములను రైతులకు తిరిగి ఇచ్చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్పల్లి అంజయ్య యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అధికారంలోకి వస్తే ఫార్మాసిటీని రద్దు చేస్తామని, రైతులకు ఆ భూములు ఇచ్చేస్తామని కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చినట్లు చెప్పారు. ఫార్మాసిటీపై వస్తున్న ప్రకటనలతో రైతుల్లో అయోమయం నెలకొందని ఆరోపించారు.

ఫిర్యాదుచేసినా పట్టించుకోరా?

పోలీస్ స్టేషన్ ఎదుట బాధితుల నిరసన



నిరసన తెలుపుతున్న బాధితులు

కొత్తూరు: తమ భూమి కబ్జాకు గురైందని ఫిర్యాదు చేస్తే పోలీసులు పట్టించుకోవడం లేదని బాధితులు కొత్తూరు పోలీస్ స్టేషన్ ముందు ఆదివారం నిరసనకు దిగారు. వివరాలు ఇలా ఉన్నాయి.. పెంజర్ల గ్రామానికి చెందిన చాకలి బాలయ్య(70)కు సర్వే నెంబర్ 399లో 39 గుంటల భూమి ఉంది. ఈ భూమిపై న్యాయస్థానంలో కేసు నడుస్తోంది. కొందరు తమ భూమిని కబ్జా చేసేందుకు యత్నించారని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోలేదని ఆరోపించారు. దీనిపై ఇన్‌స్పెక్టర్ నరసింహా రావును వివరణ కోరగా చాకలి బాలయ్య సరైన పత్రాలు చూపలేదన్నారు.

ఘనంగా మల్లన్న బోనాలు



శివసత్తులు, పోతురాజుల విన్యసాలు

షాబాద్: ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని వెంకమ్మగూడలో ఆదివారం మల్లన్న బోనాలు, కల్యాణోత్సవం ఘనంగా జరుపుకున్నారు. మహిళలు బోనం ఎత్తుకుని ఊరేగింపుగా తరలివచ్చారు. నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మద్దూర్ శకుంతల, ఎంపీటీసీ గుత్తి సునీతా రామస్వామి, మాజీ ఎంపీటీసీ పాండు, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు సాయం



మొయినాబాద్: కార్తీక్‌రెడ్డి కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

షాద్‌నగర్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు ఆదివారం టూ వీలర్స్ మెకానిక్ అసోసియేషన్ నాయకులు ఆర్థిక సహాయం అందజేశారు. గత సంవత్సరం మండల పరిధిలోని వేముల నర్వ గ్రామానికి చెందిన అనిల్‌కుమార్, మహల్ ఎలికట్ట గ్రామానికి చెందిన దుర్గా ప్రసాద్‌లు మృతి చెందారు. విషయం తెలుసుకున్న టూవీలర్స్ అసోసియేషన్ నాయకులు పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మృతుల కుటుంబాలకు రూ.20వేలు సాయం చేశారు. ఈ సందర్భంగా కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ పినబాక ప్రభాకర్ హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సుధాకర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి భాస్కర్, రాజేశ్, రఘు, బాల్‌రాజ్, బుచ్చి లింగం, అశోక్‌రెడ్డి, సలీం, విజయ్, కుమార్, సిరాజ్, దశరథ్, నర్సింహ్మారెడ్డి, యాదగిరి, పాల్గొన్నారు.

చెక్కు అందజేత..

మొయినాబాద్: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఉద్యమకారుడు, బీఆర్‌ఎస్ కార్యకర్త కుటుంబానికి ఎమ్మెల్యే కాలె యాదయ్య ఇన్సూరెన్స్ చెక్కు అందజేశారు. రాజేంద్రనగర్‌లోని బండ్లగూడ జాగీర్‌కు చెందిన గడ్డం కార్తీక్‌రెడ్డి(30) గతేడాది చిన్నషాపూర్ గేటు సమీపంలో హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కార్తీక్‌రెడ్డి బీఆర్‌ఎస్ సభ్యత్వం తీసుకోవడంతో అతని కుటుంబానికి మంజూరైన రూ.2 లక్షల ప్రమాద బీమా చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి జి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

షాద్‌నగర్: పట్టణంలోని ప్రగతి విద్యాలయం ఉన్నత పాఠశాలలో 2003–04 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని రాయికల్ టోల్‌ప్లాజా సమీపంలోని పీఎస్‌ఆర్ రిసార్టులో నిర్వహించారు. ఈ సందర్భంగా తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఉపాధ్యాయులు రాధాకృష్ణ, నరేందర్, బాల్‌రాజ్, రఘుమారెడ్డి, నాగేశ్వర్‌రావు, ఇంద్ర, రఫత్‌సుల్తానా, ఉమాదేవి, సువర్ణ, అనురాధలను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు

శంకర్‌పల్లిలో..

శంకర్‌పల్లి: శంకర్‌పల్లి సాయి జూనియర్ కళాశాల 2004–2006 ఇంటర్మీడియట్ బ్యాచ్ ఆదివారం మండలంలోని ప్రొద్దటూరు గ్రామ శివారులోని ప్రగతి సుదామలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. వారి జ్ఞాపకాలను, కష్ట సుఖాలను ఒకరినొకరు చెప్పుకున్నారు. ఎన్నో రోజుల తరువాత కలుసుకోవడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మహేష్, గోపాల్, మాణిక్యం, సంజీవ, నరేందర్‌రెడ్డి, జ్యోతి, లలిత, మహేందర్‌రెడ్డి, సువర్ణ, సుజాత, పాల్గొన్నారు.



షాద్‌నగర్: ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు



శంకర్‌పల్లి: సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు

ఆలయ బ్రహ్మోత్సవాల్లో ఎడ్ల పోటీలు



ఆలయ ప్రాంగణంలో ఎడ్ల పోటీలను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

కందుకూరు: పులిమామిడి పరిధి శ్రీచీకటి వేంకటేశ్వరస్వామి దేవాలయం బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయ ప్రాంగణంలో ఎద్దులతో బండరాయి లాగే పోటీలు నిర్వహించారు. అందులో మొదటి స్థానంలో నిలిచిన ఎడ్లజత యజమాని వెంకటేశ్‌యాదవ్‌కు రూ.35 వేలు, రెండో స్థానంలో నిలిచిన.. రామాంజనేయులుకు రూ.25 వేలు, మూడో స్థానంలో నిలిచిన.. నవీన్‌నాయుడుకు రూ.15 వేలు నగదు ఆలయ కమిటీ అందజేసింది. ట్రాక్టర్ ట్రాలీతో నిర్వహించిన రివర్స్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన పాపగళ్ల సుధాకర్‌కు రూ.5 వేలు, రెండో స్థానంలో నిలిచిన ఎండీ జహంగీర్‌కు రూ.3 వేల నగదును ఆలయ కమిటీ అందజేసింది. అంతకు ముందు సామూహిక సత్యనారాయణ వ్రతాలు ఆలయ ధర్మకర్త మొకరాల లక్ష్మణ్ శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత



షాబాద్: శివపార్వతుల కల్యాణంలో పాల్గొన్న మాజీ సర్పంచ్ స్వరూప, ఎంపీటీసీ వనిత

షాబాద్: ప్రతిఒక్కరూ దైవ చింతన అలవర్చుకుంటే మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ సర్పంచ్ మునగపాటి స్వరూప నర్సింహులు, ఎంపీటీసీ వనిత పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలో సర్దార్‌నగర్ గ్రామంలోని శివాలయంలో శివపార్వతుల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు.

వేదపండితుల మంత్రోచరణాల మధ్య సర్దార్‌నగర్ గ్రామం మార్మోగింది. భక్తులు ఓంనమశివాయ..శంభోశివశంకర నామాస్మరణను జపించారు. మధ్యాహ్నం 11గంటలకు కల్యాణం జరిగింది. ఈ కార్యక్రమంలో జగదీశ్ గుప్తా, రాంమోహన్‌గుప్తా, సరేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

కేశంపేట: సమాజంలో ప్రతిఒక్కరూ దైవ చింతన కలిగి ఉండాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పోమాల్‌పల్లి, కొండారెడ్డిపల్లి గ్రామాల శివారులోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం శకటోత్సవం (బండ్లు తిరుగుట)ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొని ప్రారంభించారు. అనంతరం అయన మాట్లాడుతూ సమాజంలో భక్తిభావం కలిగి ఉంటేనే మనస్సు ప్రశాంతంగా ఉంటుందన్నారు.

ఈ కార్యక్రమంలో స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి, మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, ఎంపీటీసీలు సురేష్‌రెడ్డి, మంజుల రాజశేఖర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూడ వీరేష్, యెన్నం శ్రీధర్‌రెడ్డి, పల్లె అనంద్‌కుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.